క్లుప్తంగా

సంక్రాంతి జూదాలకు అనుమతుల్లేవు

తిరువూరు ఆర్డీవో మాధురి



తిరువూరు: సంక్రాంతి పండుగ పేరుతో జూదాలు నిర్వహించేవారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని తిరువూరు ఆర్డీవో కే మాధురి హెచ్చరించారు. సోమవారం స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో రెవెన్యూ, పోలీస్, పశుసంవర్ధక, పంచాయతీరాజ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో కోడిపందేల నియంత్రణకు జాయింట్ యాక్షన్ టీంలను ఏర్పాటు చేయాలని, ఎవరైనా పందేల నిర్వహణకు సిద్ధమైనా, జూదాలు వేసినా కేసులు నమోదు చేసి భారీ జరిమానా వేస్తామన్నారు. జూదాల నియంత్రణకు మండల స్థాయిలో కంట్రోల్ రూంలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. తిరువూరు, గంపలగూడెం, ఏకొండూరు, విస్సన్నపేట, రెడ్డిగూడెం మండలాల అధికారులు పాల్గొన్నారు.

దుస్తుల పంపిణీ



చాట్రాయి: మండలంలోని చిన్నంపేట గ్రామానికి చెందిన కొమ్ము లక్ష్మికి చెందిన తాటాకు ఇల్లు ఇటీవల విద్యుత్ షార్టు సర్క్యూట్‌తో పూర్తిగా దగ్ధమైంది. గ్రామానికి చెందిన సిద్ధార్థ హైస్కూలు విద్యార్థులు సేకరించిన నిధులతో స్కూల్ ప్రిన్సిపాల్ పలగాని శ్రీనివాసరావు బాధిత కుటుంబానికి దుస్తులు, వంట సామగ్రి సోమవారం అందజేశారు. కార్యక్రమంలో ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కొమ్ము ఆనందం పాల్గొన్నారు.

బాలిక ఆపరేషన్‌కు సాయం



కాచవరం(ఇబ్రహీంపట్నం): కాచవరం ఎంపీపీ పాఠశాలకు చెందిన ఒకటో తరగతి బాలిక ప్రవల్లిక ఆపరేషన్ నిమిత్తం పెడన బట్టా జ్ఞాన కోటయ్య జెడ్పీ పాఠశాల పూర్వ విద్యార్థులు రూ.15 వేలు ఆర్థిక సహాయం సోమవారం అందజేశారు. ఆరు నెలల క్రితం అడుకుంటూ డాబాపై నుంచి కింద పడటంతో బాలిక కాలు విరిగి ఆపరేషన్ జరిగింది. కాలులో ఉన్న రాడ్స్ తీసేందుకు మరో ఆపరేషన్ చేయాల్సి ఉంది. బాలిక తండ్రి గతంలో మరణించడంతో ఆపరేషన్ చేయించడం తల్లికి భారంగా మారింది. పాఠశాల హిందీ ఉపాధ్యాయుడు ఇర్ఫాన్ పాషా సహచర పూర్వ విద్యార్థులు (1993-94) ఉబేదుల్లా ఖాన్, అబ్దుల్‌కలాంలు ఎన్నారై బండారు చైతన్య ప్రోత్సాహంతో నగదు అందజేశారు. హెచ్‌ఎం భవాని పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ అందజేత



మైలవరం: చదువు విద్యార్థుల జీవితాలను మంచి మార్గంలోకి నడిపే సాధనం అని ఎమ్ఎస్ఆర్ ఫౌండేషన్ ప్రెసిడెంట్ ముప్పిడి నాగేశ్వరరెడ్డి తెలిపారు. రెడ్డిగూడెం మండలంలోని రంగాపురం కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో సోమవారం పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేశారు. విద్యార్థులకు చదువు ప్రాధాన్యతను గుర్తు చేస్తూ, విద్య వారి జీవితాల్లో సానుకూల మార్పులను తీసుకురాగల శక్తి కలిగిన సాధనమన్నారు. జీవితంలో స్థిరత్వం, విజయానికి చదువే బలమైన పునాది అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లూయిస్ బ్రెయిలీకి నివాళి



గానుగపాడు(తిరువూరురూరల్): అంధుల కోసం ప్రత్యేక లిపి రూపొందించిన లూయిస్ బ్రెయిలీ చిరస్మరణీయుడని తిరువూరు మండలం గానుగపాడు జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఆదిలక్ష్మి అన్నారు. సోమవారం పాఠశాలలో లూయిస్ బ్రెయిలీ జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంధుడైన బ్రెయిలీ తన తోటివారి ఇబ్బందులు తొలగించడానికి ప్రత్యేక లిపి తయారుచేశారన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తప్పుల సవరణకు అవకాశమివ్వాలి

వీరులపాడు: కులగణన జాబితాలో తప్పుల సవరణకు అవకాశం కల్పించాలని ఎమ్మార్పీస్ జిల్లా అధ్యక్షుడు మందా పిచ్చయ్య మాదిగ కోరారు. కులగణనలో జరిగిన తప్పుల సవరణకు అవకాశంతో పాటు గడువు తేదీ పొడిగించాలని కోరుతూ మండలంలోని జుజ్జూరు తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం తహసీల్దార్ హుస్సేన్‌కు వినతిపత్రం అందజేశారు.

దిగుబడి లేక దిగాలు

- తగ్గుతున్న పత్తి దిగుబడులు
- పెట్టుబడులు కూడా రావటం లేదంటున్న రైతులు
- ప్రభుత్వం కొనుగోలు చేయాలని వినతి



మైలవరంలో పత్తి పంట

మైలవరం: ఈ ఏడాది ప్రతికూల వాతావరణం, తుఫాన్‌తో పత్తి దిగుబడి తగ్గి రైతులు దిగాలు చెందుతున్నారు. పెట్టిన పెట్టుబడులు కూడా రాని పరిస్థితి ఎదురవుతోందని వాపోతున్నారు.

నియోజకవర్గంలో ఇలా..

నియోజకవర్గంలోని మైలవరంలో రైతులు 993 హెక్టార్లలో పత్తి సాగు చేస్తుండగా జి.కొండూరు మండలంలో 2746 హెక్టార్లు, రెడ్డిగూడెం మండలంలో 200 హెక్టార్లు, ఇబ్రహీంపట్నం మండలంలో 427 హెక్టార్లలో రైతులు పత్తి పంట సాగు చేస్తున్నారు.

ఎకరాకు రూ.40 వేలకు పైగా..

పత్తి సాగుకు ఎకరానికి రూ.40 వేలు పైగా ఖర్చు అవుతుందని, కానీ పెట్టిన పెట్టుబడి రాక సరైన ధర లేక నష్టాలు చవిచూడాల్సి వస్తోందని రైతు జే శ్రీనివాసరెడ్డి తెలిపారు. దీంతో ఎకరానికి రూ.15 నుంచి రూ.20 వేలు నష్టం వచ్చిందన్నాడు. అంతా అనుకూలంగా ఉంటే ఎకరానికి 9 నుంచి 10 క్వింటాళ్ల దిగుబడి రావాల్సి ఉండగా ఈ ఏడాది ఎకరానికి కనీసం ఏడు క్వింటాళ్లు కూడా వచ్చే పరిస్థితి లేదని రైతులు చెబుతున్నారు. గతంలో గుంటూరు, ఒంగోలు నుంచి బయ్యర్లు పత్తి కొనుగోలు చేసుకుని వెళ్లేవారు. కానీ ప్రస్తుతం ఆ పరిస్థితి కన్పించడంలేదు.

ధరాఘాతం..

ఒక పక్కన దిగుబడి తగ్గి, కనీస మద్దతు ధర లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కనీసం ప్రభుత్వం అయినా దీనిపై స్పందించి రైతులకు మద్దతు ధర లభించేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

కొనుగోలు కేంద్రాల దుస్థితి..

మైలవరం ఏఎంసీలో పత్తి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేసే పరిస్థితి ఉండేది. ప్రస్తుతం ఏమైందో ఏమో కాని పత్తి కొనుగోలు ఊసే ఎత్తడం లేదు. అసలు పత్తి కొనుగోలు చేస్తారో లేదో తెలియని పరిస్థితి.



నష్టాలే కన్పిస్తున్నాయి..

పత్తి సాగుకు ఎకరానికి రూ.15 వేలు చొప్పున 4 ఎకరాలు కౌలుకు తీసుకున్నా. ఎకరానికి అన్నీ కలిపి రూ.40 వేలు ఖర్చయింది. అకాల వర్షాలకు పత్తి కాయలు తడిచి కుళ్లిపోయాయి. ఎకరానికి ఏడు క్వింటాళ్లు మాత్రమే దిగుబడి వచ్చింది. అమ్మితే ఎకరానికి రూ.15 నుంచి రూ.20 వేలు నష్టం వచ్చింది. వర్షాలకు రంగు మారిందని, క్వాలిటీ లేదని బయ్యర్లు సాకులు చెబుతున్నారు. పత్తి తీసేసి మొక్కజొన్న పంట వేశాను. ప్రభుత్వం ఆదుకుని కనీస మద్దతు ధర ప్రకటిస్తే కొంత మేలు జరుగుతుంది.

– ఉల్లిబోయిన సాంబశివరావు, కొత్తగూడెం

గుంటూరుకు తెమ్మంటున్నారు..

ఏఎంసీలో కొందరు రైతులు ధాన్యం ఆరబోశారు. పత్తి నిల్వ చేస్తే దుమ్ము పడి రంగు మారుతుందని బయ్యర్ అంటున్నాడు. పత్తి కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపటం లేదు. నేరుగా గుంటూరు తీసుకువస్తే కొనుగోలు చేస్తామని చెబుతున్నారు.

– శ్రీనివాసరావు, కార్యదర్శి, ఏఎంసీ, మైలవరం

రిమోట్‌తో పత్తి తూకంలో అవకతవకలు

దళారులకు దేహశుద్ధి

చాట్రాయి: పత్తి తూకంలో రిమోట్ ద్వారా అవతవకలు చేస్తున్న దళారులకు దేహశుద్ధి చేసిన సంఘటన. మండలంలోని పర్వతాపురం గ్రామంలో చొప్పర్ల బజారులో సోమవారం ప్రైవేట్ వ్యాపారులు పత్తిని కొనుగోలు చేశారు. కొన్న పత్తిని తక్కువ బరువు వచ్చేలా రిమోట్ కంట్రోలు ద్వారా కాటా వేశారు. కాళ్ల సందులో ఉన్న రిమోట్‌ని గమనించిన రైతులు నిలదీయడంతో ఇద్దరు వ్యాపారులు పారిపోగా ఒక వ్యాపారిని పట్టుకుని నిలదీశారు. రిమోట్‌తో తూకాన్ని తగ్గించడం వాస్తవమేనని ఒప్పుకోవడంతో వ్యాపారికి రైతులు దేహశుద్ధి చేశారు. క్వింటా కాటాకు పది కిలోల తేడాను గమనించి, పట్టుకున్న వ్యాపారికి రైతులు రూ.20 వేలు జరిమానా విధించి విడిచి పెట్టారు.

కార్మిక పరిషత్‌కు నూతన కమిటీ

బస్టాండ్ (విజయవాడపశ్చిమ): ఏపీపీటీ కార్మిక పరిషత్ (ఏపీఎస్ఆర్టీసీ) తిరువూరు డిపోలో నూతన కార్యవర్గం ఏర్పాటైంది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు కార్మిక పరిషత్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికులకు అండగా ఉండి వారి సంక్షేమానికి కృషిచేస్తానని హామీ ఇచ్చారు. కార్మికుల విజ్ఞప్తి మేరకు గతంలో రద్దు చేసిన తిరువూరు–గంగావతి, తిరువూరు– మంత్రాలయం సర్వీసులను పునరుద్ధరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. తిరువూరు డిపోలో పనిచేస్తున్న ఉద్యోగులందరికీ సొంత గృహాల నిర్మాణం చేపట్టేందుకు ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కార్మిక పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.వి.శేషగిరిరావు, ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావు, సభ్యులు కోసూరి సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణం తనిఖీ

తిరువూరు: స్థానిక మెయిన్‌రోడ్డులోని శ్రీకోదండరామ మెన్యూర్స్ ఎరువుల దుకాణంలో సోమవారం మండల వ్యవసాయాధికారి పద్మ ఆకస్మిక తనిఖీ చేశారు. దుకాణంలో బిల్ పుస్తకాలు, స్టాకు రిజిస్టర్లు, స్టాకు బోర్డు తనిఖీ చేశారు. అనంతరం ఈపోస్‌లో స్టాక్, సాధారణ స్టాకు వివరాలు పరిశీలించారు. దుకాణంలోని ఎరువులను నాణ్యతా ప్రమాణాల తనిఖీ నిమిత్తం నమూనాలను ల్యాబ్‌కు పంపినట్లు ఏవో తెలిపారు.

అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలి

సబ్‌కలెక్టర్ బచ్చు స్మరణ్‌రాజ్



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న సబ్‌కలెక్టర్ బచ్చు స్మరణ్‌రాజ్

నూజివీడు: స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) నిర్వహించి ప్రజల నుంచి సబ్‌కలెక్టర్ బచ్చు స్మరణ్‌రాజ్ అర్జీలను స్వీకరించారు. 12 అర్జీలు రాగా వాటిని పరిష్కారం నిమిత్తం సంబంధిత అధికారులకు పంపారు. పంచాయతీరాజ్ ఈఈ తాడిపత్రి బాపిరెడ్డి, ఏడీఏ జి.విద్యాసాగర్, డీఎల్‌డీఓ వెంకటరత్నం, డీఎల్‌పీఓ ఎంపీఎస్ సుందరి, ఉపాధి హామీ పథకం ఏపీడీ శ్రీదేవి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ చిలుకూరు భాస్కరరెడ్డి, హెచ్ఓ హేమ తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమైన అర్జీలు ఇలా..

- తన భర్త గతేడాది ఫిబ్రవరి 16న మృతి చెందాడని ఇప్పటి వరకు తనకు వితంతు పింఛను మంజూరు కాలేదని, వితంతు పింఛను మంజూరు చేయాల్సిందిగా కోరుతూ నూజివీడు మండలం మిట్టగూడెం శివారు రామానగర్‌కు చెందిన పల్లెపాం సీతమ్మ అర్జీని అందజేశారు.
- తనకు ప్రభుత్వం నూజివీడు మండలం పల్లెర్లమూడిలో 2.50 ఎకరాల భూమిని ఎక్స్ సర్వీస్ మెన్ కోటాలో కేటాయించిందని, ఇందులో రెండు ఎకరాలను జగనన్న కాలనీ కోసం ఇచ్చామని, ఆరు సెంట్లు విలేజ్ హెల్త్ క్లినిక్ భవన నిర్మాణానికి వితరణంగా ఇచ్చామన్నారు. మిగిలిన 44 సెంట్ల భూమికి సర్వే చేసి సబ్‌డివిజన్ చేయాల్సిందిగా కోరుతూ మర్రిబంధానికి చెందిన యనమదల రామదాసు అర్జీని అందజేశారు.
- నూజివీడు పట్టణంలోని కోటవారిపేటలో మూడు సెంట్ల ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి అమ్ముకుంటున్నారని తెలిపారు. ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకొని అందులో ప్రభుత్వ భవనాలను నిర్మించాలని కోరుతూ గరబాప విజయ్‌కుమార్ అర్జీని అందజేశారు.

సర్వీసు ప్రొవైడర్ల నమోదు



మున్సిపల్ కార్యాలయ ఆవరణలో పేర్లను నమోదు చేసుకుంటున్న సర్వీసు ప్రొవైడర్లు

నూజివీడు: మెప్మా, హోం ట్రయాంగిల్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో సర్వీసు ప్రొవైడర్ల నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్లంబర్లు, ఎలక్ట్రీషియన్, మెకానిక్, వాషింగ్ మెషిన్ మెకానిక్, ఏసీ మెకానిక్, కార్పెంటర్లు, పెయింటర్లు, తదితరులు తమ వివరాలను నమోదు చేసుకున్నారు. వీరిలో అన్ని అర్హతలు ఉన్న వారినిఎంపిక చేసి సంక్రాంతి తరువాత హోం ట్రయాంగిల్ సంస్థ నైపుణ్య శిక్షణను ఇస్తుందని మెప్మా ఇన్‌చార్జి సీఎంఎం నాగోజీ తెలిపారు. తర్వాత యాప్‌లో వారి చిరునామాలు, ఫోన్ నంబర్లు నమోదు చేసి, గుర్తింపు కార్డులు ఇస్తారు. వినియోగదారులతో ఎలా మెలగాలో వివరిస్తారు. సేవలు కావాల్సిన వారు యాప్‌లో బుక్ చేసుకుంటే సంబంధిత సిబ్బందిని పంపిస్తారని పేర్కొన్నారు.

పాలిటెక్నిక్ పరీక్షా ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ



విస్సన్నపేట: ఆంధ్రప్రదేశ్ స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ నిర్వహించిన పాలిటెక్నిక్ ఐదో సెమిస్టర్ పరీక్షా ఫలితాల్లో వికాస్ పాలిటెక్నిక్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని వికాస్ విద్యా సంస్థల చైర్మన్ ఎన్. నర్సిరెడ్డి తెలిపారు. కంప్యూటర్ సైన్స్ విభాగంలో తమ కళాశాల విద్యార్థి టీ మమత 96.4 శాతం మార్కులు సాధించినట్లు తెలిపారు. బత్తుల అనూష, జల్లి సాయికుమార్ 91.5 శాతం మార్కులు సాధించారని పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ రమేష్, అధ్యాపకులు విద్యార్థులను అభినందించారు.

తొలగించిన వర్కర్‌ను విధుల్లోకి తీసుకోవాలి

కంచికచర్ల: ఎంపీపీ పాఠశాలలో తొలగించిన స్కూల్ శానిటేషన్ వర్కర్‌ను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని, లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళన నిర్వహిస్తామని సీఐటీయూ నాయకుడు సోమేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని గండేపల్లి ఎంపీపీ స్కూల్‌లో స్కూల్ శానిటేషన్ వర్కర్‌గా గట్టిగుండె ఇందిర గత ఆరేళ్ల నుంచి పనిచేస్తోందని, కూటమి నాయకులకు తలొగ్గిన ఎంఈఓ ఎటువంటి నోటీసు ఇవ్వకుండా తొలగించారని అన్నారు. శానిటేషన్ వర్కర్‌గా పనిచేస్తున్న ఇందిరకు పదేళ్ల క్రితం భర్త అనారోగ్యంతో మృతిచెందాడని, ఉన్న ఒక్క కుమారుడు కూడా ఐదేళ్ల క్రితం మృతి చెందాడని వితంతువు, ఒంటరి మహిళ అని కూడా చూడకుండా కక్షపూరితంగా ఆమెను విధుల్లో నుంచి తొలగించారని మండిపడ్డారు. ఇందిరను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన స్పందనలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎం.వేంకటేశ్వరరావు అర్జీ ఇచ్చారని తెలిపారు.

రాయనపాడులో సమస్యలపై కలెక్టర్‌కు వినతి

భవానీపురం(విజయవాడపశ్చిమ): విజయవాడ రూరల్ మండలం రాయనపాడు గ్రామంలోని రెండు ఎస్సీ కాలనీల మధ్య ఉన్న పాత పంట కాలువపై సిమెంట్ దిమ్మెలు ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగకుండా రక్షణ చర్యలు తీసుకోవాలని గ్రామస్తుడు చింతపల్లి దాసు విజ్ఞప్తి చేశారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అధికారులకు వినతి పత్రం అందజేశారు. గ్రామంలోని తాగునీటి వాటర్ ట్యాంక్‌ను వెంటనే శుభ్రం చేయించాలని కోరారు. ఆర్‌ఓ ప్లాంట్‌లో నాలుగేళ్ల క్రితం మిషన్ పాడైపోయిన నేపథ్యంలో గ్రామంలోని కొందరు వ్యక్తులు మిషన్ కొనుగోలు చేశామని చెబుతూ వాటర్ క్యాన్ రూ.8లకు అమ్ముతున్నారని తెలిపారు. ప్లాంట్ దగ్గర అనధికార వ్యక్తులను తొలగించి పంచాయతీ ద్వారా మంచినీటిని ఉచితంగా అందించాలని వినతి పత్రంలో పేర్కొన్నారు.

విద్యార్థులకు ముగ్గుల పోటీలు



నూజివీడు: పట్టణంలోని శ్రీసిద్ధార్థ జూనియర్ కాలేజీ విద్యార్థులకు యాజమాన్యం ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ పోటీలను ప్రారంభించిన కళాశాల డైరెక్టర్ గొల్లపూడి రవిబాబు మాట్లాడుతూ భావితరాలు సంస్కృతి సంప్రదాయాలను మరిచిపోకుండా చూడాల్సిన బాధ్యత పెద్దలపై ఉందన్నారు. మన సంస్కృతి ఎంతో గొప్పదని, బాలికలు చిన్నప్పటి నుంచే ముగ్గులు వేయడంలో మెలకువలను నేర్చుకుంటారన్నారు. అనంతరం ముగ్గుల పోటీల్లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థినులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కాలేజీ అధ్యాపక సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

10న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

ముసునూరు: మండల పరిషత్ పాలకవర్గ సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ జి.రాణి తెలిపారు. సోమవారం విలేకరులతో మాట్లాడుతూ ఎంపీపీ కొండా దుర్గాభవాని అధ్యక్షతన ఈ నెల 10న ఉదయం పది గంటలకు సర్వసభ్య సమావేశం నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

రేపటి నుంచి షటిల్ పోటీలు

తిరువూరు: అభ్యుదయ బ్యాడ్మింటన్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 8 నుంచి తిరువూరు నియోజకవర్గ స్థాయి షటిల్ ఔట్‌డోర్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు కన్వీనర్ శివకృష్ణ తెలిపారు. తిరువూరు అభ్యుదయ స్కూలు ఆవరణలో జరిగే ఈ పోటీలలో విజేతలకు ప్రథమ బహుమతి రూ.10 వేలు, రెండో బహుమతి రూ.8 వేలు, మూడో బహుమతిగా రూ.6 వేలు, నాలుగో బహుమతిగా రూ.4 వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు. వివరాలకు 77023 30600 నంబరులో సంప్రదించాలని కోరారు.

ఇంటర్ విద్యార్థులకు శిక్షణ

తిరువూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల వృత్తి విద్యా కోర్సుల విద్యార్థులకు సోమవారం తిరువూరు మండల పరిషత్ కార్యాలయంలో ఆన్ జాబ్ శిక్షణ ఇచ్చారు. ఆఫీస్ అసిస్టెంట్ షిప్‌లో భాగంగా మండల పరిషత్ కార్యాలయంలో ఉద్యోగుల విధులు, రికార్డుల నిర్వహణ, మండల పరిషత్ అధికారాలను ఎంపీడీవో రవిబాబు వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మి, గ్రంథాలయాధికారి ప్రసాద్, అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తికి గాయాలు

నూజివీడు: పట్టణంలోని ఎమ్మార్ అప్పారావు కాలనీకి చెందిన పందిరిపల్లి శివ (26) అనే యువకుడు విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. పట్టణంలోని విజయవాడ రోడ్డులోని బేతస్థ ఇంటిగ్రేటెడ్ స్కూల్ (బీస్) వద్ద నిర్మిస్తున్న హోటల్ నిర్మాణ పనుల్లో భాగంగా సోమవారం మధ్యాహ్నం గోడలకు ప్లాస్టింగ్ చేస్తుండగా ప్రమాదవశాత్తు రోడ్డు వెంబడి ఉన్న విద్యుత్ తీగ తగలడంతో షాక్‌కు గురై తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని పట్టణంలోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్య నిమిత్తం శివను విజయవాడ ఆసుపత్రికి తరలించారు.

సంపూర్ణపోషణ కిట్లపై అవగాహన

తిరువూరు: అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలకు అందించే సంపూర్ణ పోషణ కిట్లు ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయని తిరువూరు నగర పంచాయతీ 6వ వార్డు మహిళా సంరక్షణ కార్యదర్శి విజయలక్ష్మి సూచించారు. శాంతినగర్ అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం గర్భిణులు, తల్లులకు సంపూర్ణ పోషణ కిట్ల ప్రయోజనాలపై అవగాహన సమావేశం నిర్వహించారు. సంపూర్ణ పోషణ కిట్లను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ కార్యకర్త సుశీల, సిబ్బంది పాల్గొన్నారు.

సారా తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

చాట్రాయి: సారా సరఫరా చేస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు నూజివీడు ఏలూరు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్సై ఫణికుమార్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని చిన్నంపేట గ్రామంలో దాడులు నిర్వహిస్తుండగా పోతనపల్లి గ్రామానికి చెందిన ధారావతు సోమరాజు అనే వ్యక్తి బైక్ మీద సారా తరలిస్తుండడంతో అతడిని అదుపులోకి తీసుకుని బైక్‌ని, సారా స్వాధీనం చేసుకున్నట్లు ఆయన చెప్పారు. ఈ దాడుల్లో ఎస్సై మస్తాన్‌రావు తదతరులు పాల్గొన్నారు.

నూతన సంవత్సర క్యాలెండర్ల ఆవిష్కరణ



కొండపల్లిలో జేవీవీ న్యూ ఇయర్ క్యాలెండర్, డైరీ ఆవిష్కరిస్తున్న మురళీమోహన్, తదితరులు



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ రవి, అధ్యాపకులు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో న్యూ ఇయర్ క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ కార్యక్రమం కొండపల్లిలో సోమవారం జరిగింది. ఈ సందర్భంగా జేవీవీ జిల్లా అధ్యక్షుడు వెనిగళ్ల మురళీమోహన్, ప్రముఖ వైద్యులు మామిడి సీతారామారావు మాట్లాడుతూ 36 ఏళ్లుగా ప్రజల కోసం సైన్స్, ప్రగతి కోసం నినాదంతో ప్రజలను చైతన్య వంతులను చేయడంలో జనవిజ్ఞాన వేదిక ప్రముఖ పాత్ర పోషిస్తుందన్నారు. సామాన్య ప్రజల్లో మూఢవిశ్వాసాలు నిర్మూలించి శాస్త్రీయ విజ్ఞానం పెంపొందించే దిశగా అడుగులు వేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జేవీవీ జిల్లా ఉపాధ్యక్షుడు పి.కామేశ్వరరావు, సభ్యులు ఎస్.నాగరాజు, సర్దార్ సాహెబ్, చేతన్‌మురళీ, డేవిడ్ పాల్గొన్నారు.

మైలవరం: మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అధ్యాపకుల సంఘం ఎన్టీఆర్ జిల్లా క్యాలెండర్‌ను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ళ రవి, కార్యదర్శి డాక్టర్ జే రాముడు కలిసి సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ రవి మాట్లాడుతూ అధ్యాపకులు అంతా ఐకమత్యంతో విద్యార్థులకు విద్యా బుద్ధులు నేర్పిస్తూ, ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలన్నారు. జిల్లా కార్యదర్శి డాక్టర్ జే రాముడు మాట్లాడుతూ అధ్యాపక మిత్రులందరూ అకుంఠిత దీక్షతో పనిచేస్తూ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన చదువు చెప్పి ఉద్యోగులుగా, మంచి పౌరులుగా తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం: విద్యుత్ శక్తి ఎంప్లాయీస్ ట్రేడ్ యూనియన్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ సంఘం కార్యాలయంలో సోమవారం ఆవిష్కరించారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు నారబోయిన శ్రీనివాసరావు కార్మికుల సమస్యలు ఆయనకు వివరించారు. ఉద్యోగులు డీఏ బకాయిలు, కాంట్రాక్ట్ కార్మికుల క్రమబద్ధీకరణ అంశాలు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని కోరారు. యూనియన్ కార్యవర్గం సభ్యులు పాల్గొన్నారు.

నూజివీడు: రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం, సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూజివీడు శాఖల సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం 2025 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో క్యాలెండర్‌ను సంఘ అధ్యక్షుడు బీఎం సింగ్, పలగాని పిచ్చయ్య ఆవిష్కరించారు. నూతన సంవత్సర సందర్భంగా కేకులను కట్ చేశారు. కార్యక్రమంలో సంఘ ప్రధాన కార్యదర్శి బండారు సత్యనారాయణ, సహాధ్యక్షుడు ఆర్.సాంబయ్య, ఉపాధ్యక్షుడు వి.స్టాన్లీ ప్రభాకరరావు, కోశాధికారి కేజేడీ రిచర్డ్, కేవీ శేషయ్య, డి.సాల్మన్‌రాజ్ ఎం.బాబూరావు, మహిళా అధ్యక్షురాలు కె.శారదాదేవి, కార్యదర్శి ఎ.మేరి, ఎం.సలోమి, కె.నిర్మలకుమారి, పి.రాజరాజేశ్వరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కాలర్‌షిప్పు చెక్కుల పంపిణీ



విద్యార్థులకు స్కాలర్‌షిప్స్ అందజేస్తున్న సతీష్‌కుమార్, డాక్టర్ అనిల్‌కుమార్‌రెడ్డి, వెంకటరత్నం

మైలవరం: లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో రెన్యూవల్ స్కాలర్‌షిప్పులు అందుకున్న విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత స్థితికి చేరుకుని పేద, మధ్య తరగతి విద్యార్థులకు తమ వంతుగా సహాయం చేయాలని లయన్స్ క్లబ్ పూర్వపు డిస్ట్రిక్ట్ గవర్నర్, చైర్మన్ పుట్టగుంట వెంకట సతీష్ కుమార్ తెలిపారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో నార్త్ సౌత్ ఫౌండేషన్ రెన్యూవల్ స్కాలర్‌షిప్స్ చెక్కులు పంపిణీ కార్యక్రమం సోమవారం జరిగింది. ఎల్‌బీఆర్‌సీఈ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ద్వారా 120 మంది విద్యార్థులు ఒక్కొక్కరికి రూ.25 వేలు చొప్పున అందజేశారు. ఇప్పటి వరకు నార్త్ సౌత్ ఫౌండేషన్ ద్వారా రూ.87.50 లక్షలు, కళాశాల మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ద్వారా రూ.27.20 లక్షలు, కళాశాల చైర్మన్ లకిరెడ్డి ప్రసాదరెడ్డి ద్వారా మెరిట్ విద్యార్థులకు రూ.6.20 లక్షలు స్కాలర్‌షిప్స్ రూపంలో అందజేశామన్నారు. కార్యక్రమంలో అతిథులుగా డాక్టర్ కుడుముల అనిల్‌కుమార్‌రెడ్డి, సీఈఓ ఏకే డెంటల్ ఎల్ఎల్‌సీ, యూఎస్ఏ, ఆంధ్రహాస్పిటల్స్ డైరెక్టర్ డిస్ట్రిక్ట్ కేబినెట్ సెక్రటరీ హెల్త్ డిస్ట్రిక్ట్ 316డి లయన్ కామినేని అచ్యుతబాబు, ప్రిసైడింగ్ ఆఫీసర్, నార్త్ సౌత్ ఫౌండేషన్, విజయవాడ చాప్టర్ కోఆర్డినేటర్, లయన్స్ ఎడ్యుకేషనల్ స్కాలర్‌షిప్స్ డిస్ట్రిక్ట్ చైర్పర్సన్ లయన్ సూరానేని వెంకటరత్నం, కళాశాల ప్రెసిడెంట్ జీ శ్రీనివాస రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ బి.హరిశివ ప్రసాద్, రెడ్ క్రాస్ సొసైటీ మైలవరం సబ్ బ్రాంచ్ సెక్రటరీ అండ్ ట్రెజరర్ గూడూరు నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కిశోర బాలికల సంరక్షణ సామాజిక బాధ్యత



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న ఎంపీపీ జోత్స్న, ఎంపీడీవో సునీత శర్మ, తదితరులు

ఇబ్రహీంపట్నం: కిశోర బాలికల సంరక్షణ సామాజిక బాధ్యతగా స్వీకరించాలని ఎంపీపీ పాలడుగు జోత్స్నఅన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కిశోర బాలిక సంరక్షణ, విద్య,ఆరోగ్యం, తదితర అంశాలపై ఏఎన్ఎంలు, ఆశాలు, అంగన్‌వాడీలకు అవగాహన సదస్సు సోమవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలను అరికట్టేందుకు చిత్తశుద్ధితో కృషి చేయాలని సూచించారు. ఎంపీడీవో సునీత శర్మ మాట్లాడుతూ బాలికా విద్యను ప్రోత్సహించి, బడి మానేసిన బాలికలను పాఠశాలల్లో చేర్పించాలన్నారు. ప్లకార్డులు ప్రదర్శించారు. ఎంఈవో సీహెచ్ పుష్పలత, ఈవోపీఆర్డీ మనోజ్, ఐసీడీఎస్ అధికారులు, సూపర్‌వైజర్లు, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

జెడ్పీ పాఠశాలలో డీవైఈవో విచారణ

జగ్గయ్యపేట: నందిగామ ఇన్‌చార్జ్ డీవైఈవో వెంకటప్పయ్య సోమవారం పట్టణంలోని జిల్లా పరిషత్ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల పాఠశాల ప్రధానోపాధ్యాయురాలిపై ఫిర్యాదులు రావటంతో జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విచారణ చేపడుతున్నామన్నారు. అనంతరం ఉపాధ్యాయులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పదో తరగతి పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేయాలని, నూరు శాతం ఫలితాలు వచ్చేలా పాఠ్యాంశాలను బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. సిలబస్ పూర్తి చేయాలని, లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎంఈవో చిట్టిబాబు పాల్గొన్నారు.